# సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 5 । మార్చి । 2023






## వైభవంగా వసంతోత్సవం

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 37వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితుల కనులపండువగా నిర్వహించారు.



## గ్రామాల్లోకి ఐఏఎస్‌లు

కేంద్ర సర్వీసులకు ఎంపికైన అధికారులు గ్రామస్థాయిలో అధ్యయనం చేసేందుకు శనివారం 26మంది జిల్లాకు చేరుకున్నారు. వారితో కలెక్టర్ సంగీత కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/20.0

## వాతావరణం

ఆకాశం ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

## గళం విప్పితే కరతాళ ధ్వనులే..



పాట పాడుతున్న పెందోట బాలశ్రీనివాసాచారి

తన గళంతో మంత్రముగ్ధులను చేయడం బాలశ్రీనివాస్‌కే సొంతం. రాజన్న సిరిసిల్ల సీపీవో పెందోట బాలశ్రీనివాసాచారి బాల్యం నుంచే సరిగమలను ఔపోసన పట్టగా వేదిక దొరికిందంటే చాలు పాటలతో మైమరిపింపజేస్తారు. ఈయనది మానకొండూరు మండలం వేగురుపల్లి స్వగ్రామం. కరీంనగర్‌లో స్థిరపడ్డారు. తన తాత కట్ట లక్ష్మీనర్సయ్య ఆల్‌ఇండియా రేడియో ఆర్టిస్ట్. ఆయన వద్ద సంగీతం నేర్చుకుని చదువుకునే వయసు నుంచి పాటలు పాడి బహుమతులు అందుకున్నారు. జానపదం, సినీగీతాలు, పౌరాణిక గాథలను వినసొంపుగా వినిపిస్తుంటారు.



బంగి జంప్ చేస్తున్న జీవీ.శ్యాంప్రసాదలాల్



## సాహసాలకు కేరాఫ్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్ రచయితలు, కవులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంటారు. అదే సమయంలో సాహసాలకూ చిరునామాగా నిలుస్తున్నారు. యువకులతో పోటీ పడుతుంటారు. నిత్యం విధి నిర్వహణలో సమీక్షలు, తనిఖీలతో బిజీగా ఉంటున్నా.. వీలు చిక్కినప్పుడల్లా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలను సందర్శిస్తుంటారు. ఉత్తరప్రదేశ్‌లో ఓ సారి బంగిజంప్ కూడా చేసి ఔరా అనిపించారు. సాహస క్రీడలైన కనోయింగ్ తోపాటు అడవుల్లో నిర్వహించే వివిధ అంశాల్లో పాల్గొంటున్నారు.

# వృత్తిలో ఆదర్శం ప్రవృత్తిలో నైపుణ్యం

## ఓవైపు విధులు.. మరోవైపు అభిరుచుల ప్రస్థానం

- ఆదర్శంగా నిలుస్తున్న అధికారులు
- ఒక్కొక్కరిది ఒక్కో ప్రత్యేకత

సండే స్పెషల్

కరీంనగర్ అర్బన్: వృత్తి, ప్రవృత్తుల సంగమమంటే ఈ అధికారులు గుర్తొస్తారు. ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న వీరిది ఒక్కొక్కరిది ఒక్కో శైలి. విధి నిర్వహణలో ప్రజలకు సేవలందిస్తూనే.. తమ అభిరుచులకు తగ్గట్టు జీవిస్తున్నారు. ఒత్తిడిని మరిచి ఉల్లాసంగా గడుపుతున్నారు. తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకరు సాహసాలకు చిరునామాగా నిలిస్తే.. మరొకరు పాటల పూదోటలో కోయిలలుగా రాణిస్తున్నారు. ఇంకొకరు వ్యాఖ్యానం చేస్తూ మాటల మాంత్రికుడిగా ముఖ్యులతో అభినందనలు పొందుతున్నారు. మరో అధికారి ఫ్లూట్‌ను వినసొంపుగా వినిపిస్తూ.. ఆకట్టుకుంటుండగా మరొకరు నటనతో రంజింపజేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలోని పలువురు ద్విపాత్రాభినయ అధికారులపై సండే స్పెషల్..

## మాటల మాంత్రికుడు గోపాల్



వ్యాఖ్యానం చేస్తున్న మాడిశెట్టి గోపాల్

ఉమ్మడి జిల్లాలో వ్యాఖ్యానమంటే మాడిశెట్టి గోపాల్ పేరే వినిపిస్తుంది. కరీంనగర్‌కు చెందిన గోపాల్‌ది ఎల్ఐసీలో హయ్యర్‌గ్రేడ్ అసిస్టెంట్ హోదా. అటు విధి నిర్వహణ.. ఇటు ప్రవృత్తిని కొనసాగిస్తూ గుర్తింపు పొందారు. గణతంత్ర, స్వాతంత్ర్య, రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో వినిపించే మాటలు ఇతనివే. అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్.రాజశేఖర రెడ్డి జిల్లా పర్యటనల సమయంలోనూ తన వ్యాఖ్యానం ద్వారా అభినందనలు పొందారు. మలేసియా, సింగపూర్‌లోనూ వ్యాఖ్యానం చేశారు. ఉత్తమ వ్యాఖ్యాతగా అనేక అవార్డులు పొందారు. దీనితోపాటు కవి, రచయిత, నటుడిగానూ రాణిస్తున్నారు.

## ఫ్లూట్ పట్టారంటే సంగీత ప్రవాహమే..



శంకరపట్నం తహసీల్దార్ గూడూరి శ్రీనివాసరావుది చొప్పదండి మండలం కాట్నపల్లి. చదువుకునే రోజుల్లో టీవీల్లో ఫ్లూట్ ఊదుతుండడాన్ని గమనించి ఆసక్తి పెంచుకున్నారు. ఎంసెట్‌కు దరఖాస్తు చేస్తానని ఇంట్లో చెప్పి హైదరాబాద్ వెళ్లి ఫ్లూట్ కొనుక్కున్నారు. వాయిద్యకారుడు కంచర నారాయణ వద్ద ఓనమాలు నేర్చుకుని అప్పటినుంచి ఫ్లూట్ వినిపిస్తున్నారు. ఏ మాత్రం విరామం దొరికినా ఫ్లూట్ పడుతుంటారు. సంగీతాన్ని పాటను మేళవించి ఫ్లూట్‌ను వాయించడం ఇతనికే సొంతం.



## సంకీర్తనల పూదోట ప్రియాంక

జెడ్పీ సీఈవో సీహెచ్.ప్రియాంక విధినిర్వహణలో బిజీగా ఉంటున్నా.. ఏ మాత్రం విరామం దొరికితే చాలు.. తన స్వరానికి పనిచెబుతుంటారు. కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సతీమణి అయిన ఈమె ఇటీవలే ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉన్నాయంటే చాలు ఈమె భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుంది. చిన్నతనం నుంచే సంగీతం నేర్చుకున్న ప్రియాంక.. బ్రహ్మోత్సవాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాటలు పాడుతూ అలరిస్తుంటారు. ఇటీవల కరీంనగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో 'ముద్దుగారే యశోద' అంటూ ఆలపించిన సంకీర్తనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

## పాతమధురాల గీతం మంజుల



కరీంనగర్ బాల భవన్ సూపరింటిండెంట్ కట్ట మంజులాదేవి ప్రభుత్వ అధికారిగా కన్నా గాయకురాలిగానే గుర్తింపు పొందారు. ఉమ్మడి జిల్లాలోని అధికారుల్లో మంజులాదేవిది ప్రత్యేకస్థానం. ప్రతి గణతంత్ర, స్వాతంత్ర్య, రాష్ట్ర అవతరణ వేడుక సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగే తేనీటి విందులో ఈమె పాట ఉండాల్సిందే. ఎంత ఒత్తిడిలో ఉన్నా పాటతో మనసు తేలిక అవుతుందంటారు మంజుల. ఈమె రాజన్న సిరిసిల్ల సీపీవో శ్రీనివాసాచారి సతీమణి కావడం గమనార్హం.

## ఎత్తు వేస్తే చిత్తవ్వాల్సిందే



చెస్ ఆడుతున్న కానిపర్తి మనోహర్‌రావు

చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పీఏగా ఉన్న నాయబ్ తహసీల్దార్ కానిపర్తి మనోహర్‌రావుది కరీంనగర్‌లోని వావిలాలపల్లి. బాల్య దశలోనే చదరంగంపై మక్కువ పెరగడంతో డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేవారు. స్వతహాగా చదరంగంలో మెలకువలు నేర్చుకుంటూనే రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉద్యోగం చేస్తూనే శాఖాపరంగా నిర్వహించే క్రీడలో పాల్గొంటూ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఆలిండియా, స్టేట్ విభాగాల్లో ప్రథమ స్థానం పొందారు.

# గులాబీ జెండా ఎగురవేద్దాం..!

- ఉమ్మడి కరీంనగర్‌లో 13కు 13స్థానాలూ గెలుస్తాం
- మాకంటే పెద్ద హిందువులా మీరు?
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి గంగుల కమలాకర్
- చీఫ్‌విప్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుకు ఘన స్వాగతం



భారీ గజమాలతో ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న నాయకులు

సాక్షి, పెద్దపల్లి: సమష్టిగా పనిచేసి ఉమ్మడి జిల్లాలో గులాబీ జెండా ఎగురవేద్దామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాద్‌రావు సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ పాదయాత్రల పేరుతో తిరుగుతూ.. మన బొగ్గు, నీళ్లు, కరెంట్ ఎత్తుకుపోయేందుకు చూసే ఢిల్లీ పార్టీలు ఎందుకని ప్రశ్నించారు. 75 ఏళ్ల పాలించిన ఢిల్లీ పార్టీల పాలన చూశామని, గతంలో ఎట్లుండే.. ఇప్పుడెట్లా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. 'మేం హిందువులం కాదా..? మాకంటే పెద్ద హిందువులా మీరు..? జై శ్రీరామ్ అని మేం అనమా..? బట్టేబాజ్ బీజేపీకి బుద్ధి చెప్పాలి..' అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలందరం ఒక్కటే. కేసీఆర్ సూచించిన వారిని ఉమ్మడి జిల్లాలోని 13స్థానాలకు 13 బరాబార్ గెలుపించుకుందామని, ఆ దిశగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే కేసీఆర్‌కు ఎంతో ఇష్టమని, రాబోయే రోజుల్లో ఉమ్మడి జిల్లాను మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు.

### సమష్టిగా పనిచేయాలి

పార్టీలో కుమ్ములాటలకు కారణమవుతున్న వారిని కట్టడి చేయాల్సిన అవసరముందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. అందరం సమష్టిగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

### చర్చ జరగాలి

పార్టీని బలహీనపరిచే చర్చ వద్దని, బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపైనే ప్రజల్లో చర్చ జరగేలా కార్యకర్తలు పనిచేయాలని ఎంపీ వెంకటేశ్‌నేత అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రధాని అయ్యేలా పనిచేయాలన్నారు.

### సెల్ఫీలతో టికెట్ రాదు

సెల్ఫీ దిగితే టికెట్ రాదని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతూ కష్టపడితే టికెట్ వస్తుందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. ప్రతిపక్షాల వైఫల్యాలపై చర్చ జరిగేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.

### గెలిపించే బాధ్యత తీసుకోవాలి

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు.

### దుబ్బపల్లి వద్ద ఘన స్వాగతం

సుల్తానాబాద్‌రూరల్: చీఫ్‌విప్‌గా జిల్లాకేంద్రానికి తొలిసారి వచ్చిన భానుప్రసాద్‌రావుతోపాటు మంత్రి గంగుల, ఎంపీ వెంకటేశ్ నేతకు సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్ద స్వాగతం పలికారు. బీఆర్ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, బాలాజీరావు, సందీప్‌రావు, రాజేశ్వర్‌రావు, ఫక్కీర్‌యాదవ్, వీరగొని రమేశ్ గౌడ్, శ్రావణ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### భారీ గజమాలతో సన్మానం

సుల్తానాబాద్: చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాదరావుకు సుల్తానాబాద్‌లో 30 ఫీట్ల గజమాలతో మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్, సింగిల్ విండో డైరెక్టర్ గాజుల రాజమల్లు 30 ఫీట్ల గజమాలతో స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్మన్ బిరుదు సమత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పార్టీ టికెట్ ఇచ్చిన వారిని గెలిపిద్దాం

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేయబోనని గతంలో చెప్పానని, ఇప్పుడూ చెబుతున్నానని చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. కేసీఆర్ ఆదేశాలను పాటిస్తూ పార్టీ బలోపేతానికి పార్టీ బీ ఫామ్ ఇచ్చిన వారి గెలుపునకు కృషి చేస్తానన్నారు. చీఫ్‌విప్‌గా తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు ద్విచక్రవాహనాల భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. రాజీవ్ రహదారి పొడవునా ప్రతి గ్రామంలో పూలమాలలు వేస్తూ స్వాగతించారు. ఎంపీ గార్డెన్స్‌లో సన్మాన సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ, పోలీసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ఈద శంకర్‌రెడ్డి, రాకేశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు, రామగుండం మేయర్ అనిల్‌కుమార్, టీఆర్ఎస్ నాయకులు రేకుంట అశోక్, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## నమో నారసింహ..

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ వేదపండితులు ప్రత్యేకపూజలు చేశారు. కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. శేషప్ప వేదికపై నృసింహుని కల్యాణం కన్నులపండువగా జరిపించారు.



## శిశువు మృతిపై టూమెన్ కమిటీ

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 2న శిశువు మృతి చెందిన విషయం విదితమే. దీనిపై విచారణకు టూమెన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు డీసీహెచ్ శ్రీధర్ తెలిపారు. స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో శాస్త్రినగర్‌కు చెందిన కల్వల సుమంగళికి జన్మించిన పాప వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిందని ఆమె సోదరుడు నరేశ్ డీసీహెచ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీసీహెచ్ కమిటీ వేశారు. ఇందులో గైనకాలజిస్ట్, సీనియర్ డాక్టర్ భీష్మ, రుక్మిణిని నియమించారు. సుమంగళి అడ్మిట్ అయినప్పటి నుంచి ఆమెకు అందించిన వైద్యసేవలు, సిబ్బంది వ్యవహరించిన తీరు.. ప్రసవ సమయంలో తీసుకున్న చర్యలపై విచారణ చేసి నివేదిక అందించాలని ఆదేశించారు.

### కడుపునొప్పి అంటే కరీంనగర్‌కు తరలింపు

సుమంగళి కడుపులో నొప్పి వస్తోందని చెప్పడంతో ఆసుపత్రి సిబ్బంది ఆమెను శనివారం ఉదయం కరీంనగర్‌కు రెఫర్ చేశారని ఆమె సోదరుడు నరేశ్ తెలిపారు. విచారణ సమయంలో ఆమె ఆసుపత్రిలో ఉంటే ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉందని, ముందుజాగ్రత్తగానే వైద్యులు సిఫార్సు చేశారని ఆరోపించారు. కరీంనగర్ ఆసుపత్రి వర్గాలు మాత్రం ప్రసవం తర్వాత శుభ్రం చేయకపోవడంతోనే ఇన్ఫెక్షన్ సోకిందని చెప్పినట్లు కుటుంబ సభ్యులు అంటున్నారు. విధులు నిర్లక్ష్యం చేసిన సిబ్బంది, డాక్టర్లపై చర్యలు తీసుకునే వరకూ వెనుకాడబోమని తెలిపారు. సుమంగళి ఆరోగ్య పరిస్థితి మెరుగుకు కోసమే కరీంనగర్ తరలించారని డీసీహెచ్ శ్రీధర్ తెలిపారు. కరీంనగర్ ఆసుపత్రిలోనే సోమవారం విచారణ చేయనున్నట్లు తెలిపారు.

# 'పుట్ట, పూదరి'తో ప్రాణభయం

- తమను ఎదిరిస్తే 'గట్టు' దంపతుల గతేనంటూ బెదిరింపులు
- అన్ని ఆధారాలతో సీపీకి ఫిర్యాదు చేస్తాం..
- విలేకరుల సమావేశంలో రామగిరి ఎంపీపీ దేవక్క



మాట్లాడుతున్న ఎంపీపీ దేవక్క దంపతులు

రామగిరి(మంథని): జెడ్పీ చైర్మన్ పుట్ట మధు.. కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ నుంచి తమకు ప్రాణభయం ఉందని జిల్లాలోని రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. సెంటినరీకాలనీలోని తన చాంబర్‌లో శనివారం తన భర్త కొమురయ్యతో కలిసి విలేకరుల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. ఎంపీడీవో రమేశ్ తనను అనేకరకాలుగా అవమాన పరుస్తూ.. సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఇబ్బంది పెడుతున్నారని, తనను సంప్రదించకుండా.. సమాచారం ఇవ్వకుండా.. నిధులు ఇష్టారాజ్యంగా కేటాయిస్తుంటే పూదరి సత్యనారాయణ జోక్యం చేసుకుంటూ తమపైకే ఎంపీటీసీలను ఉసిగొల్పుతున్నారని, ఎంపీటీసీలతో చెక్కుబౌన్స్ కేసు వేయించారని, ఈ విషయాన్ని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. 2022 ఆగస్టు 26 కలెక్టర్‌తో జెడ్పీ చైర్మన్ ఎంపీపీ పేరిట జెడ్పీ చైర్మన్ సర్క్యూలర్ జారీ చేయించారని, ఈనెల 2న జెడ్పీ సూపరింటెండెంట్ తనకు ఫోన్ చేయగా.. జెడ్పీ కార్యాలయానికి వెళ్లిన తమను నిధులు ఖర్చు చేయకుండా ఎందుకు నిల్వ చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ ప్రశ్నించారని పేర్కొన్నారు. తాను వివరణ ఇస్తుండగానే.. ఆగ్రహంతో అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. తనను ఎదిరిస్తే హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణికి పట్టిన గతే పడుతుందని భయాందోళనకు గురి చేసినట్లు తెలిపారు. ఇక్కడ జరుగుతున్న పరిణామాలను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్తామంటే ఇక్కడ కేసీఆర్, కేటీఆర్ నో.. ఓన్లీ పుట్ట మధే బాస్ అంటూ దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. బహుజన వాదం అంటే మహిళా ఎంపీపీని తిట్టడమేనా అని కంటతడి పెట్టుకున్నారు. పుట్ట మధు, పూదరి సత్యనారాయణతో తమకు ప్రాణభయం ఉందని, సీపీకి ఫిర్యాదు చేయడంతోపాటు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. పుట్ట మాట్లాడిన మాటలు సెల్‌లో రికార్డులు ఉన్నాయని, కేసీఆర్, కేటీఆర్‌కు వినిపించిన తరువాత ప్రెస్‌కు విడుదల చేస్తామన్నారు.

## క్లుప్తంగా

### శైలేందర్‌సింగ్ అంత్యక్రియలు పూర్తి



మక్కాన్‌ను పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్

రామగుండం: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ సోదరుడు శైలేందర్‌సింగ్ అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. వందలాదిగా తరలివచ్చిన అభిమానుల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి హిందూ శ్మశానవాటికలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్‌ప్రసాద్ తదితరులు హాజరై మక్కాన్‌సింగ్, మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

### నేడు జేఎన్టీయూలో పీజీ 'నీట్'

రామగిరి(మంథని): సెంటినరీకాలనీ జేఎన్టీయూలో ఆదివారం పీజీ నీట్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించే పరీక్షకు 110 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఈ మేరకు ఏర్పాటు పూర్తి చేశామని తెలిపారు. పోలీసులు బందోబస్తు ఉంటుందన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

### గుర్తు తెలియని మృతదేహం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు సమీపంలో (తహసీల్దార్ ఆఫీసు ఎదురుగా) గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులు కనుగొన్నారు. పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తి యాచకుడు అయి ఉండొచ్చని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మల్లన్న ఆలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీ చంద్రశేఖర్

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దేవాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మల్లన్న స్వామి ఆలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కొండగట్టులో చోరీ జరిగిన నేపథ్యంలో గర్భగుడికి తరచూ వచ్చిపోయే వారిని గమనించాలని, అర్చకుల నిత్యపూజలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో పొందుపర్చాలని సూచించారు. ప్రత్యేక పండుగలు, పూజలు, వీఐపీల దర్శనాల వివరాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి ఉన్నారు.

# నూలు డిపోలు రాలేదు.. కార్మికులు ఓనర్లు కాలేదు..

- బీడీ కార్మికుల ఆస్పత్రి ఎందుకు కట్టలేదు
- కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఏమైంది
- నేరెళ్ల బాధితులకు పరిహారమేది
- సిరిసిల్లలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సిరిసిల్ల మానేరు వంతెనపై రేవంత్‌రెడ్డి యాత్ర

సిరిసిల్ల: సిరిసిల్ల నేతకార్మికులు సాంచాలపై కూలీ చేస్తున్నారని, బతుకమ్మ చీరలతో కొంత మంది పెద్ద సేట్లకు మాత్రమే లాభం జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి సిరిసిల్లలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ నుంచి సిరిసిల్ల పట్టణం వరకు పాదయాత్రగా వచ్చారు. సిరిసిల్ల నేతన్నచౌక్‌లో నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'సిరిసిల్లలో సభ అంటే.. కేటీఆర్ భయపడి ఎవరూ రారు అనుకున్నా. కానీ వారి బెదిరింపులకు భయపడకుండా.. ఇంత భారీగా జనం రావడం సంతోషంగా ఉందని' అన్నారు. సిరిసిలకు నూలుడిపోలు రాలేదని.. నేత కార్మికులు ఓనర్లు కాలేదన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉండగా.. మంజూరైన బీడీ కార్మికుల ఈఎస్ఐ ఆస్పత్రిని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీని పూర్తి చేయకుండా.. కమీషన్లను మంత్రి కేటీఆర్ దండుకున్నారని ఆరోపించారు. 9వ ప్యాకేజీ పూర్తి చేస్తే సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలు సస్యశ్యామలం అయ్యేవని.. కానీ కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్‌లు పూర్తి చేసి నీటిని తరలించుకుపోయారన్నారు. నేరెళ్ల దళితులను ఎందుకు ఆదుకోలేదని ప్రశ్నించారు. ఇసుక లారీలకు అడ్డు వస్తున్నారని పోలీసులు కొడితే.. మంత్రి కేటీఆర్ ఆ కుటుంబాలకు ఎందుకు అండగా నిలువలేదని అడిగారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కె.కె.మహేందర్‌రెడ్డిని పక్కన పెట్టి కేసీఆర్ స్వార్థంతో తన కొడుక్కు సీటు ఇచ్చాడన్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ల్యాండు, సాండు, మైనింగ్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర రావడం లేదన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నిజాలు తప్ప అబద్ధాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల రాజయ్య, అంజన్‌కుమార్‌యాదవ్, బలరాం నాయక్, పొన్నం ప్రభాకర్, కెకె.మహేందర్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగుల సత్యనారాయణగౌడ్, చీటి ఉమేశ్‌రావు, అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

**బాలికల హాస్టల్ సందర్శన**

సిరిసిల్ల పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించి, బాలికలతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మెనూ అమలుతీరు, వాష్‌రూమ్స్, వసతులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వడ్డించే భోజనాన్ని రేవంత్‌రెడ్డి పరిశీలించారు. బాలికలతో చాలా సేపు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణులో జోష్ పెంచింది.

# ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్

మంథని: మంథని ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడ్డ అంతర్‌జిల్లా ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మంథనిలో నిర్వహించిన సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ వివరాలు వెల్లడించారు. పంట పొలాలకు వినియోగించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కొల్లగొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్తున్న అంతర్ జిల్లా ముఠాను అరెస్టు చేసి వారి నుంచి 2.70 క్వింటాళ్ల వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పక్కా సమాచారం మేరకు మంథని ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఎక్లాస్‌పూర్ అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన మడిపెల్లి సాయితేజ, దోనిపల్లి సురేష్, మీనుగు మల్లేష్, రేగుంట వర్ధన్, చిప్పకుర్తి రాకేశ్, పులి సిద్దు ఊరఫ్ భరద్వాజ్, బానేష్‌తో పాటు మరో ఇద్దరు మైనర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కాపర్ వైరు, రెండు టాటా ఏసీ వాహనాలను స్వాధీనం చేసుకొని విచారించారు. ఈ నేపథ్యంలో తొమ్మిది మంది దొంగలు రెండు ముఠాలుగా ఏర్పడి పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలింది. మంథని పోలీస్ స్టేషన్ పరిధిలో 14, బసంతనగర్ 3, అంతర్గాం 6, గోదావరిఖని 2, టౌన్ స్టేషన్ పరిధిలో 5, ఎన్‌టీపీసీ 1, కమాన్‌పూర్ పరిధిలో 2 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ చేసి అమ్ముకున్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ పరిధిలో 14, చెన్నూర్ టౌన్ 8, కోటపల్లి 1, సీసీసీ స్టేషన్ పరిధిలో 1, దండెపల్లి 4, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొయ్యూర్ స్టేషన్ పరిధిలో 1, కాటారం 3 ఇలా మూడు జిల్లాలో చోరీలకు పాల్పడ్డారు. తొమ్మిది మంది నిందితులతో పాటు కాపర్ వైరు కొనుగోలు చేసిన ఎన్‌టీపీసీకి చెందిన తూర్పాటి తిరుపతి, పురాణం రజితపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే ఈ కేసులో పురాణం జంపయ్య అనే స్క్రాప్ వ్యాపారి పరారీలో ఉన్నాడని తెలిపారు. దొంగల ముఠా గుట్టురట్టు చేసిన మంథని, గోదావరిఖని సబ్‌డివిజన్ పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, మంథని సీఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన 'స్మార్ట్ ఫెస్ట్- 2023'



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

పెద్దపల్లిరూరల్: మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం 'స్మార్ట్ ఫెస్ట్- 2023' పేరిట ఎంబీఏ విద్యార్థులు వార్షికోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఎంబీఏ విద్యను పూర్తి చేసుకున్న వారంతా వ్యాపార రంగాల్లో, పేరొందిన కంపెనీల్లో రాణిస్తున్నారని రాష్ట్ర ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వరలక్ష్మి పేర్కొన్నారు. ఎంబీఏలో చేరిన విద్యార్థులు రెండేళ్ల కాలం మంచి శిక్షణ పొందితేనే మంచి ఉద్యోగాలు రావడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఓడీ ఉపేందర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సీనియర్ అధ్యాపకులు అంబిక, దేవేందర్, నరేశ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఓదెల రైల్వేస్టేషన్‌లో పలు రైళ్ల హాల్టింగ్

ఓడెల: ఓదెల రైల్వేస్టేషన్లో పలు రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రామగిరి, అజ్నీతోపాటు సికింద్రాబాద్ నుంచి సిర్‌పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే పలురైళ్ల హాల్టింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కరోనా సమయంలో రద్దయిన రైళ్లు తిరిగి పునరుద్ధరించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మన ఊరు- మనబడితో పాఠశాలలకు మహర్దశ



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

రామగిరి(మంథని): మన ఊరు - మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పడుతోందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. ముత్తారం మండలం కేశనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.13లక్షలతో చేపట్టిన ఆధునీకరణ పనులను శనివారం ప్రారంభించారు. నియోజకవర్గాన్ని ఏళ్ల తరబడి పాలించినవారు ఎప్పుడూ అభివృద్ధి, సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయంపై పత్యేక దృష్టి సారించిందని, జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జెడ్పీటీసీ చెల్కల స్వర్ణలత, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ దాసరి రాజలింగు, సర్పంచ్‌ల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో సంపత్ రావు, పప్పు స్వరూప, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### కాన్షీరాం ఆశయాలు కొనసాగిద్దాం



పెద్దపల్లిరూరల్: సమసమాజ స్థాపనకు పాటుపడిన కాన్షీరాం ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని జెండా కూడలిలో ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్‌సన్నీ, కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాన్షీరాం విగ్రహాన్ని శనివారం ఆయన సోదరి స్వరణ్‌కౌర్ ఆవిష్కరించారు. సమసమాజ స్థాపనకు ఎంతగానో పాటుపడ్డాడని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, చిరుమిల్ల రాకేశ్, నాయకులు నల్ల మనోహర్ రెడ్డి, వేముల రామ్మూర్తి, బి.రమేశ్‌గౌడ్, గాండ్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గుబాయి వార్తలు

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులతో క్యారమ్ ఆడుతున్న శ్రీదేవి

రామగిరి(మంథని): నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్జీ–3, ఏపీఏ ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగిరి మండలం సెంటినరీకాలనీలోని జేఎన్టీయూ యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 'స్థిరమైన లింగ సమానత్వం నేడు, రేపటి కోసం' అంశంపై శనివారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తుండడంతో తల్లిదండ్రులు సైతం ఆడ, మగ అనే భేదాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఆడపిల్లలు ఆకాశమే హద్దుగా ఎదుగుతున్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పురుషులతో సమానంగా అవకాశాలు లభించినప్పుడే సమన్యాయం జరుగుతుందని, అప్పుడే లింగ వివక్ష తొలగిపోతుందన్నారు. ఆడపిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులతో పాటు కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఆరోగ్యానికి నిత్యం ఆటలు ఆడాలని సూచించారు. కళాశాలలోని విద్యార్థినుల కోసం నిర్వహించిన షటిల్, క్యారం, చెస్ పోటీలను ప్రారంభించి కొంతసేపు పిల్లలతో ఆడి ఉల్లాసపరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, డీవైపీఎం కావూరి మారుతి, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**సంప్రదాయానికి ప్రతీక ముగ్గులు**

మన సంస్కృతి, సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీకగా నిలుస్తాయని ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల సేవా సమితి అధ్యక్షురాలు శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సెంటినరీకాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలను పరిశీలించి మాట్లాడారు. పోటీల్లో గెలిచినవారికి ఈనెల 8న బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కొప్పుల విజయ, డీవైపీఎం కావూరి మారుతి, సీఈఆర్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

గోదావరిఖని(రామగుండం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ఆర్జీ–1 సేవా అధ్యక్షురాలు కె.పద్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మ్యూజికల్ చైర్, బాంబ్‌బ్లాస్ట్, సూదిలో దారం, త్రోబాల్, లేమన్‌ఇన్ స్పూన్, ఆటలపోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, సీనియర్ పీఓ సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేశ్, సేవా కోఆర్డినేటర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెకు యాజమాన్యాలే బాధ్యత వహించాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): ఓసీపీల్లో రేపటి నుంచి జరిగే సమ్మెకు యాజమాన్యాలే బాధ్యత వహించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, శాతవాహన మల్టీపుల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కౌశిక్‌హరి, సీఐటీయూ అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన ఓబీ కాంట్రాక్టు కార్మికుల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఓబీ యాజమాన్యాలు కార్మిక సమస్యలపై కార్మిక సంఘాలతో చర్చించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈనెల 6 నుంచి సమ్మె ప్రకటించినా మొద్దు నిద్రపోతున్నట్లు యాజమాన్యాలు నటిస్తున్నాయన్నారు. విఫలం చేసేందుకు మాత్రం కుటిలయత్నాలను కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబీ యాజమాన్యాలు ఎన్ని బెదిరింపులకు దిగినా పట్టుదలతో సమ్మెను విజయవంతం చేయాలన్నారు. తమ హక్కులు, సౌకర్యాలపై జరిగే సమ్మెను ధైర్యంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కె.సూర్యం, ఐ.క్రిష్ణ, పూసాల తిరుపతి, మద్దెల శ్రీనివాస్, బుర్ర తిరుపతి, వేల్పుల కుమారస్వామి, తోకల రమేష్, వెంకన్న, పెద్ద సంఖ్యలో ఓబీ కార్మికులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని జీఎంకు వినతి

రామగిరి(మంథని): ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య కోరారు. శనివారం జీఎం వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించి మాట్లాడారు. వేసవికాలన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, క్యాంటీన్ తోపాటు ఇతర ప్రదేశాల్లో వాటర్ కూలర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పని స్థలాల్లో చలువ పందిర్లు వేయించాలని, భారీ యంత్రాలలోని ఏసీలు పని చేసేలా మరమ్మతులు చేయించి, మంటలను ఆర్పే పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంపత్‌రెడ్డి, జక్కుల దామోదర్, దాసరి మల్లేష్, వేగోళపు మల్లయ్య, ఇసంపెల్లి రమేష్, కాంతాల కిషన్‌రెడ్డి, బోగం పూర్ణాకర్, బైరం సదానందం, ఉప్పు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి**

సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు సింగరేణి యాజమాన్యమే ఉచితంగా బట్టలు, బూట్లు, మెడికల్ వీటీసీ కల్పించాలని కోరారు. సెక్యూరిటీ గార్డులకు ఏలాంటి సామగ్రి ఇవ్వకుండా పనులు చేయించడం మూలంగా టెండర్ మారినప్పుడల్లా ఆర్థికంగా నష్టపోతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నూతనంగా కేటాయించిన టెండర్‌లో ఉచితంగా సామగ్రి అందజేయాలని డిమాండ్ చేశారు.

# సర్పంచ్‌కు బిల్లులు చెల్లించారు



విశ్రాంతి తీసుకుంటున్న రవీందర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ఆ సర్పంచ్‌కు అన్ని బిల్లులను అధికారులు చెల్లించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక అప్పులపాలై మనస్తాపంతో ఈనెల 1న ఎంపీడీఓ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట సర్పంచ్ అన్నేడి రవీందర్‌రెడ్డికి ఎస్‌టీఓలో ఉన్న పెండింగ్ బిల్లులను అధికారులు చెల్లించారు. జనరల్ ఫండ్‌కు సంబంధించి 15 చెక్కులకు గాను రూ.2.27లక్షలు, ఎస్ఎఫ్‌సీకి సంబంధించి 6 చెక్కులకు గాను రూ.2.69లక్షలు, సీఎఫ్‌సీ 4 చెక్కులకు రూ.2.52లక్షలు చెల్లించారు.

# గ్రామాల్లోకి ఐఏఎస్‌లు

- జిల్లాకు చేరిన 26 మందితో కలెక్టర్ సమావేశం



ధర్మారం : స్వాగతం పలుకుతున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: కేంద్ర సర్వీసులకు ఎంపికైన అధికారులు గ్రామ స్థాయిలో అధ్యయనం చేసేందుకు శనివారం 26మంది జిల్లాకు చేరుకున్నారు. వారితో కలెక్టర్ సంగీత కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. జిల్లాలో అమలవుతున్న పథకాలు, సంక్షేమం వివరాలు, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై వివరించారు. ఈనెల 10వరకు ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, జూలపల్లి మండలం కుమ్మరికుంట, శ్రీరాంపూర్ మండలం లక్ష్మీపూర్, ధర్మారం మండలం పత్తిపాక, మంథని మండలం నాగారం గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. గ్రామాల్లో పర్యటించనున్న అధికారుల బృందానికి వసతులు కల్పించి సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఓ శ్రీధర్, డీపీవో చంద్రమౌళి, సీపీఓ రవీందర్, డీఏఓ ఆదిరెడ్డి ఉన్నారు.

**కుమ్మరికుంటకు చేరిన అధికారులు**

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటలో ఐదుగురు ఐఏఎస్ అధికారులు అభిజిత్ శర్మ (బీహార్), నితీశ్‌మిశ్రా, కమలేశ్‌కుమార్ (ఉత్తరప్రదేశ్), మిహిర్, రాహుల్ (ఢిల్లీ) పర్యటించారు. వీరికి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీడీవో వేణుగోపాలరావు, సర్పంచ్ సంతోష్‌రావు, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, ఎంపివో రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

**పత్తిపాకలో ట్రైనీ ఐఏఎస్ బృందం**

ధర్మారం: మండలంలోని పత్తిపాక గ్రామాన్ని ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం శనివారం సందర్శించింది. సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, సర్పంచు బద్దం సుజాత ఆధ్వర్యంలో బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఐఏఎస్ బృందంలో ఆశీష్, కల్పన (హర్యానా), ఆయాశా, జాగృతి (ఢిల్లీ), సునిల్ (రాజస్థాన్)ఉన్నారు.

**సుల్తాన్‌పూర్‌లో**

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ట్రైనీ ఏఏఎస్‌లకు సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు స్వాగతం పలికారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి ఏపీఎం సుధాకర్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, ఏవో ఉమాపతి ఉన్నారు.

**నాగారంలో..**

మంథని: శిక్షణ ఐఏఎస్‌లు మంథని మండలం నాగారం చేరుకున్నారు. ప్రజలు, అధికారులతో సమావేశమై పలు అంశాలు సేకరించారని ఎంపీడీఓ రమేశ్ తెలిపారు. సర్పంచ్ బూడిద మల్లేశ్ పాల్గొన్నారు. బృందంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అభిషేక్ తివారీ, సుజిత్‌పధాన్, జాగృతి గోయాల్, లక్ష్మీనారాయణ్ వర్మ, అనిషా గౌర్ ఉన్నారు.